

మాస్టర్ క్లాసిక్-2024 బాడీ బిల్డర్‌గా అన్వర్



ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4 : మండలంలోని మర్రిపల్లిగూడకు చెందిన ఎండీ అన్వర్ మాస్టర్ క్లాసిక్-2024 బాడీ బిల్డింగ్ చాంపియన్‌గా నిలిచాడు. శనివారం రాత్రి శంషా బాద్‌లో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ మెన్స్ చాంపియన్ పోటీల్లో అన్వర్ చాంపియన్‌గా నిలిచాడు.

జిల్లాలో కారుణ్య ఉద్యోగ నియామక ప్రక్రియ రెండున్నరేళ్లుగా నిలిచి పోయింది. ఉమ్మడి జిల్లా పరిషత్ ఉన్న కాలంలో చేపట్టిన ఈ ప్రక్రియ వికారాబాద్ జడ్పీ ఏర్పడిన తరువాత మాత్రం ఇంత వరకూ చేపట్టలేదు. జిల్లాలో ఇప్పటి వరకు 24 మంది కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ రాజ్, పురపాలికలు, తదితర స్థానిక సంస్థల్లో లేదా ఏదేని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మరణించినా, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నా సదరు మాజీ ఉద్యోగి కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించడమే కారుణ్య నియామకం. ఉద్యోగి మృతితో మానసిక కుంగుబాటుతో పాటు జీతం రాక వారి కుటుంబాలు ఆర్థిక ఇక్కట్లు పడుతున్నాయి. ప్రభుత్వం కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టి తమ ఇబ్బందులను తీర్చాలని ఉద్యోగుల వారసులు కోరుతున్నారు.



కారుణ్యమేది?

ఉద్యోగాల కోసం వారసుల ఎదురుచూపులు


- రెండున్నరేళ్లుగా నిలిచిన నియామక ప్రక్రియ
- ఖాళీలు ఏర్పడితేనే కారుణ్య నియామకాలు
- ఉద్యోగి మృతితో కుటుంబీకుల ఆర్థిక ఇక్కట్లు
- కొలువివ్వాలని ప్రభుత్వానికి బాధితుల వేడుకోలు

వికారాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : స్థానిక సంస్థల ఉద్యోగులెవరైనా మరణించినా, లేక ఆరోగ్య కారణాల రీత్యా ఉద్యోగం చేయలేని పరిస్థితుల్లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నా సదరు ఉద్యోగి కుటుంబీకుల్లో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పిస్తోంది. ఈ విధానం కొన్ని దశాబ్దాలుగా వస్తున్నదే. అయితే జిల్లాలో రెండున్నరేళ్లుగా ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టకపోవడంతో బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. రెండున్నరేళ్లుగా కారుణ్యనియామకాల ప్రక్రియ నిలిచిపోయింది. వివిధ కారణాలతో మృతి చెందిన జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర స్థానిక సంస్థల ఉద్యోగుల వారసులు కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగి సర్వీసు కాలంలో మరణిస్తే అతడి/ఆమె కుటుంబంలో భార్య/భర్త/కుమారుడు/కూతురు లేదా కుటుంబీకుల అంగీకారం ఉన్న వారిలో ఒకరికి కారుణ్య నియామకం ఉద్యోగం ఇవ్వాలి. అతడి/ఆమె అర్హత ఆధారంగా మృతిచెందిన ఉద్యోగికి తత్సమాన ర్యాంక్ కొలువో లేక కొంత తక్కువదో ఏదో ఒక ఉద్యోగాన్ని ప్రభుత్వం కల్పించాలి. ఇది ఉద్యోగుల హక్కే కాకుండా సర్వీసు రూల్స్‌లోనూ ఉన్న నిబంధన. ప్రభుత్వ శాఖలకు సంబంధించి కారుణ్య నియామకాలు కొనసాగుతున్నా జడ్పీ, మండల పరిషత్తులు, ఇతర స్థానిక సంస్థల్లో మాత్రం సబార్డినేట్ ఉద్యోగాలు తప్ప మిగతా ఉద్యోగాల్లో నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడం లేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 2021 జూలై నెల వరకు కారుణ్య నియామకాలు చేపట్టిన జిల్లా పరిషత్ అధికారులు ఆ తరువాత ఆ ప్రక్రియను నిలిపివేశారు. కొత్త జిల్లా పరిషత్‌లకు కారుణ్య నియామకాల అధికారాలు కల్పిస్తూ 2022 జనవరిలో తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. పంచాయతీ రాజ్, పురపాలికలు తదితర స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాలకు టైపిస్టు, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు మాత్రమే ఖాళీ ఉన్నట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థలు, విద్యా శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల వారసులు తమకు అర్హతలను అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వాలంటూ ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నా ఫలితం లేకుండా పోతోందని బాధితులు వాపోతున్నారు.

అరకొర ఖాళీలు.. చిరుద్యోగాలకే అవకాశం

రెండున్నరేళ్లుగా కారుణ్య నియామకాలు చేయకపోవడంతో జిల్లాలో 24మంది బాధిత కుటుంబాల వారసులు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసును 58ఏళ్ల నుంచి 61ఏళ్లకు పెంచడంతో గతంలో మాదిరి ఖాళీలు ఏర్పడడం లేదు. జీవో 317ప్రకారం చేపట్టిన ఉద్యోగుల విభజనలో జిల్లాలో వివిధ కేడర్ల పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాలకు పంచాయతీరాజ్ టీచర్లు, స్థానిక సంస్థల ఉద్యోగుల వారసులు 24మంది జెడ్పీకి దరఖాస్తు చేసుకున్నారు. కారుణ్య నియామకాల్లో డిగ్రీ అర్హతున్న వారికి జూనియర్ అసిస్టెంట్, తెలుగు, ఇంగ్లీష్ హయ్యర్ ఉత్తీర్ణత ఉన్న వారికి టైపిస్ట్ ఉద్యోగాలిస్తారు. కనీసం పదో తరగతి చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్ జాబ్ ఇస్తారు. ప్రస్తుతం జడ్పీ పరిధిలో మూడు టైపిస్ట్, ఒక రికార్డు అసిస్టెంట్, 23 ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. జిల్లాలో కారుణ్య నియామకాలకు ఎదురు చూస్తున్న వారిలో చాలా వరకు గ్రాడ్యుయేషన్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, బీఎడ్, బీటెక్ చదివి వారు ఉండగా, ఏడుగురు డిగ్రీ కోర్సు చేస్తున్నారు. కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న 24మందిలో 17మందికి డిగ్రీ, ఆ పై విద్యార్హతలు, ఏడుగురు డిగ్రీ కోర్సు చేస్తున్నారు. వీరిలో ఏడుగురికి ఆఫీస్ సబార్డినేట్(అటెండర్) పోస్టుల్లో నియమించేందుకు జెడ్పీ అధికారులు సిద్ధమైనా తాము డిగ్రీ పూర్తిచేసే దశలో ఉన్నందున తమకు ఆ ఉద్యోగానికి బదులు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టు కావాలంటూ రాత పూర్వకంగా అధికారులకు అప్పీలు చేసుకున్నారు. ఇదిలా ఉంటే.. 2023 సెప్టెంబరులో 14జూనియర్ అసిస్టెంట్ సూపర్‌న్యూమరీ పోస్టులు మంజూరు చేయాలని కోరుతూ జెడ్పీ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. అయితే ఆ సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆ ప్రతిపాదన ఇంకా కార్యరూపం దాల్చలేదు. కొత్త ప్రభుత్వంలో అయినా కారుణ్య నియామకాలు చేసి తమపై కరుణ చూపాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. పాఠశాలలు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సర్వీసు చేస్తూ మృతిచెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాల ప్రక్రియను జిల్లా పరిషత్తు ఆధ్వర్యంలో చేపడుతారు.

పోషణ భారంలో దివంగత ఉద్యోగుల కుటుంబాలు



చనిపోయి ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగి మృతితో నెలనెలా వచ్చే వేతనం నిలిచిపోయి, చాలీచాలని పెన్షన్‌తో కుటుంబాన్ని నెట్టుకురాలేకపోతున్నారు. 2004 తరువాత నియామకమైన వారికి పెన్షన్ కూడా ఇవ్వడం లేదు. దీంతో చాలా కుటుంబాలకు ఆర్థిక ఇక్కట్లు తప్పడం లేదు. ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును మూడేళ్లకు పెంచడంతో ఖాళీల సంఖ్య స్వల్పంగా ఉంటోంది. ఉద్యోగుల విరమణ వయస్సు 58ఏళ్లు ఉన్న సమయంలో ప్రతినెలా జిల్లాలో ఖాళీలు ఏర్పడేవి. ఇప్పుడు వయసు పెంపుతో 2024 మార్చి నెల వరకు ఉద్యోగ ఖాళీలు ఏర్పడే అవకాశం లేదు. ఇలాంటి సందర్భాల్లో జిల్లాలో సూపర్‌న్యూమరరీ పోస్టులు సృష్టించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నియామకాలు చేపట్టే అవకాశం ఉన్నా ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. రెండేళ్ల కిందట ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీలో కారుణ్య నియామకాలు చేపట్టారు. పరిషత్‌ల విభజన తరువాత వికారాబాద్ జిల్లా పరిషత్‌లో ఇప్పటి వరకు ఒక్క కారుణ్య నియామకాన్నీ చేపట్ట లేదంటే అతిశయోక్తికాదు. కారుణ్య నియామకాలు చేపట్టాలంటూ కొంత కాలంగా మాజీ ఉద్యోగుల కుటుంబాల నుంచి జడ్పీ అధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

రిటైర్ అయితేనే కొత్తగా ఉద్యోగాల కల్పన

కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు ఉద్యోగాలెప్పుడు ఇస్తారా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాల కోసం ఏడాదిన్నర కిందట దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. జిల్లాలో ఎక్కువగా సబార్డినేట్ ఉద్యోగ ఖాళీలే ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు అటెండర్ ఉద్యోగాల్లో జాయిన్ అయ్యేందుకు ఆసక్తి చూపడం లేదు. కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువ మందికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని కోరుతున్నారు. ఎక్కువ మంది గ్యాడ్యుయేషన్ పూర్తి చేశారు. స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రిటైర్ అయ్యే వరకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం లేదు. ప్రభుత్వం కొత్తగా సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టిస్తే తప్ప జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల్లో నియామకాలు చేపట్టే వీల్లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో కారుణ్య నియామకాలకు బాధిత కుటుంబాల ఎదురుచూపులు ఎప్పుడు ఫలిస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉంటే 2024 ఏప్రిల్ తరువాతే జిల్లాలో ఉద్యోగుల విరమణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అంత వరకు బాధిత కుటుంబాల వారసులకు ఎదురుచూడక తప్పని పరిస్థితి ఉంది.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్
- జిల్లా అధ్యక్షుడిగా కట్కం శివకుమార్‌గుప్తా



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కొడంగల్, ఫిబ్రవరి 4 : ఆర్యవైశ్యుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం కొడంగల్‌లోని శ్రీ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య జిల్లా మహాసభ, మహిళా సంఘం, యువజన సంఘం, సేవాదళ్ నూతన కార్యవర్గాల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో స్పీకర్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పాల్గొన్నారు. వారిని ఆర్యవైశ్య సంఘం నాయకులు పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు ముఖ్య అతిథులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొడంగల్‌కు చెందిన ప్యాక్స్ చైర్మన్ కట్కం శివకుమార్‌గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్పీకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని, వారికి అన్ని రకాలా అండదండలు ఇస్తుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌గుప్తా మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి తాను కృషిచేస్తానన్నారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందని, జిల్లా సంఘంలో పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేపట్టి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్.గుర్నాథ్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులగుప్తా, జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలేశ్వర్‌గుప్తా, మల్లికార్జున్‌గుప్తా, గణేశ్‌గుప్తా, లక్ష్మీనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్: వికారాబాద్ పట్టణ పరిధి అనంతగిరిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు కౌన్సిలర్లు దేవిరెడ్యానాయక్, జైదిపల్లి మురళి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం బొడ్రాయి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్‌ను కౌన్సిలర్లు సన్మానించారు. సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహిస్తారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ మంజుల, గ్రామ పెద్దలు అనంతయ్య, బాగయ్య, రాజునాయక్, రెడ్డిశేఖర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో అవిశ్వాసం లేనట్లే!?

- నాడు కలిసొచ్చిన కౌన్సిలర్లు నేడు వెనుకంజ
- తాండూరు చైర్‌పర్సన్‌కు అభయహస్తం
- మునిసిపాలిటీలో సంఖ్యాబలం లేక బీఆర్ఎస్ వెనకడుగు
- ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు నిర్ణయం



తాండూరు మునిసిపల్ కార్యాలయం



స్వప్న, చైర్‌పర్సన్

తాండూరు, ఫిబ్రవరి 4 : 'పదవీ కాలం గడువు పది నెలలే. వరుసగా రానున్న లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మళ్లీ పోటీచేసి గెలవాలంటే రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధిపై దృష్టి పెడదాం.' అని మెజార్టీ కౌన్సిలర్ల భావన. దీంతో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు వరకూ తాండూరు బల్దియాలో కొనసాగిన అవిశ్వాస రగడ సమసిపోయినట్టే కన్పిస్తోంది. ఏడాది క్రితం చైర్‌పర్సన్ స్వప్నపై అవిశ్వాసానికి సంతకం చేసిన కౌన్సిలర్లు ప్రస్తుతం వెనుకంజ వేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, స్థానిక ఎమ్మెల్యే సైతం మారడంతో కౌన్సిలర్లు తమ ఆలోచనను మార్చుకున్నట్టు స్పష్టమవుతోంది. పదవి ఉన్న కొద్ది కాలమైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉంటూ ప్రజా పనులపై దృష్టిపెట్టాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిర్ణయించుకున్నట్లు సమాచారం. తాండూరు మునిసిపాలిటీలో ఏడాదిన్నరగా చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్‌పై వైస్‌చైర్‌పర్సన్ దీపా నర్సిములు నాయకత్వంలో బీఆర్ఎస్ అవిశ్వాసం పెట్టేందుకు పథక రచన చేశారు. స్వప్న పదవి చేపట్టి నాలుగేళ్లు పూర్తయినందున ఆమె పదవి నుంచి దిగి వేరే కౌన్సిలర్‌కు అవకాశం ఇవ్వాలంటూ చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గం కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోవడం, స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఓడిపోవడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొందరు కాంగ్రెస్‌లో చేరగా ఆ పార్టీ బలం తగ్గింది. దీంతో వైస్ చైర్‌పర్సన్ దీప వర్గం వెనక్కి తగ్గినట్లు సమాచారం. బీఆర్ఎస్ నుంచే చైర్‌పర్సన్‌గా ఎన్నికైన స్వప్న సైతం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం ఉంది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆశీస్సులు కూడా ఆమెకు ఉన్న నేపథ్యంలో మరో ఏడాది ఆమె పదవికి ఢోకా లేదనే చెప్పాలి. పార్టీ ఏదైనా కౌన్సిలర్లలో ఎన్నికల భయం నెలకొంది. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చాం, ఇంకా చేయాల్సిన పనులెన్ని? పనులకు నిధులెలా సమకూర్చుకోవాలి? మరోసారి ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల ఇబ్బందులు తీర్చేందుకే ఇంకా ఏం చేయాలి? వార్డు అభివృద్ధికి ఇంకా ఏమేం చేయాలి? అనే ఆలోచనల్లో కౌన్సిలర్లు ఉన్నారు. ఇకపై ప్రతిరోజూ అభివృద్ధి కోసం పనిచేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు తమ అంతర్గత సమావేశాల్లో చర్చించుకున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రస్తున్న చైర్‌పర్సన్ స్వప్నపై అవిశ్వాసానికి ఫుల్‌స్టాప్ పడ్డట్టేననే వాదన విన్పిస్తోంది. కాగా ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న 16 మంది కౌన్సిలర్లలోనూ ఐదారుగురు హస్తం వైపు చూస్తున్నట్లు సమాచారం!

అధ్వానంగా లింకు రోడ్డు



బీటీ పోయి కంకర రోడ్డుగా మారిన లింకు రోడ్డు

- బీటీ కొట్టుకుపోయి 15ఏళ్లయినా పట్టించుకోని ప్రభుత్వం
- కంకర తేలినా కనీస మరమ్మతులు చేయించని వైనం
- ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకపోయినా ఫలితం శూన్యం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, గ్రామాల ప్రజలు

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 4: మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ తండాతో వివిధ గ్రామాలకు ఉన్న లింక్ రోడ్డు కంకర తేలి దయనీయంగా మారింది. ఈ రోడ్డుకు 15ఏళ్లుగా బీటీ కొట్టుకుపోయి గుంతలమయమై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. లక్ష్మాపూర్ మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామమే అయినా అనుబంధ తండాలో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకున్నాయి. లింకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలుసార్లు ఎమ్మెల్యేకు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. 15ఏళ్ల క్రితం లక్ష్మాపూర్ తండా నుంచి మూడుచింతలపల్లి వరకు 2.5కిలోమీటర్ల బీటీ రోడ్డు వేశారు. ఇక అప్పటి నుంచి ఒక్కసారి కూడా మరమ్మతులు చేయలేదు. ఎక్కడికక్కడ బీటీ లేచిపోయి అడుగడుగునా గుంతలేర్పడ్డాయి. కంకర తేలింది. పెద్ద పెద్ద గోతులతో వాహనాలు ప్రయాణించలేని దుస్థితి ఏర్పడింది. తండావాసులు, సమీప గ్రామాల రైతులు ప్రధానంగా ఈ రోడ్డునే ఉపయోగిస్తుంటారు. వారి పండించే వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయాలను నగరంలో అమ్మేందుకు తరలిస్తుంటారు. రోడ్డు బాగలేక వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ ఈ రోడ్డుపై ప్రయాణించలేకపోతున్నారు. వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై నడిపితే వాహనాలు సైతం రిపేర్‌కు వస్తున్నాయి. ఏళ్లగా ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించడం లేదని గ్రామీణులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వం అయినా పరిష్కరించాలని కోరుతున్నారు.

మాజీ మంత్రికి సమస్యను విన్నవించినా...

ఈ లింకు రోడ్డు అధ్వానంగా మారిందని, దీనికి మరమ్మతులైనా చేయించాలి లేదా కొత్తగా అయినా వేయాలని అప్పటి మంత్రి.. ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు గ్రామాల్లో సీసీ రోడ్లు వేశామని, ఆలయాలు కట్టించానని చెప్పిన ఆయన లింక్ రోడ్డు మరమ్మతులను మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత రోడ్డునే బాగు చేయించలేని ఆయన కొత్తగా రోడ్లు వేయించానంటే ఎలా నమ్ముతాం? అని తండా వాసులు, వివిధ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.



మూడుచింతలపల్లి-లక్ష్మాపూర్ తండా రోడ్డు దుస్థితి..

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



మండలంలో గల అన్ని లింక్ రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. పాడైన రోడ్లపై, అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్ల గురించి అంచనాలను అధికారులకు పంపిస్తాం. త్వరలోనే తండా రోడ్లకు మహర్దశ పడుతుంది. ఇందులో అనుమానం లేదు.

శ్రీనివాస్, పీఆర్ ఏఈ మూడుచింతలపల్లి

రోడ్డు సమస్యను పట్టించుకోవడం లేదు



లింకు రోడ్డుకు బీటీ లేచిపోయి ఏళ్లయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రి వేళ ఈ రోడ్డుపై ప్రయాణిస్తే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నాం. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

- వెంకటేశ్‌నాయక్, లింగాపూర్ తండా

రాత్రి వేళ ప్రయాణించలేకపోతున్నాం



పూర్తిగా కంకర తేలిన ఈ రోడ్డుపై రాత్రుళ్లు ప్రయాణించలేకపోతున్నాం. ఈ రోడ్డుపై వాహనంతో ప్రయాణిస్తే క్షేమంగా గమ్యం చేరతామా? అనే అనుమానం కలుగుతోంది. వాహనాలు అదుపుతప్పి పడిపోవడం, టైర్లు పంక్చర్ అవడం, గంతల్లో ఎత్తేయడం మాకు సర్వసాధారణమయ్యాయి. ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై వ్యవసాయ ఉత్పత్తుల్ని కూడా తీసుకుపోలేకపోతున్నాం. మా సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రోడ్డుకు రిపేర్ చేయించడం లేదు.

- శ్రీశైలం, మూడుచింతలపల్లి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల, ఫిబ్రవరి 4: మండలంలోని అనంతసాగర్ గ్రామంలో మృతురాలి కుటుంబానికి పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన చిల్ల పుల్లమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మహేశ్‌రెడ్డి

సీడీపీవోగా అర్హత సాధించిన పంచాయతీ కార్యదర్శి నీరజ

పూడూరు, ఫిబ్రవరి 4: మండలంలోని బాకాపూర్ పంచాయతీ కార్యదర్శి నాంచేరి నీరజ ఇటీవల వెలువడిన ఫలితాల్లో సీడీపీవోగా అర్హత సాధించారు. నీరజ సొంత గ్రామం మండలంలోని కండ్లపల్లి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతోపాటు తోటి పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు. మల్టీజోన్-2లో ఆమెతోపాటు మరో ఐదుగురు అర్హత సాధించారు.


నాంచేరి నీరజ

యాలాల ఎస్‌ఐకి సన్మానం

యాలాల, ఫిబ్రవరి 4: యాలాల మండల నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన శంకర్‌ను కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పరి మల్కయ్య ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ మండలంలో బాగా పనిచేసి మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు బాలు, జి.బాలు, ఇమ్రాన్ పాల్గొన్నారు.


యాలాల ఎస్‌ఐని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

వైభవంగా ఊరడమ్మ బోనాలు

బషీరాబాద్, ఫిబ్రవరి 4: మండలంలోని నవాంద్గీ గ్రామంలో గ్రామ దేవత (ఊరడమ్మ) బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. మహిళలు బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి బోనాలతో చేరుకున్న మహిళలు ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేసి గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ దేవతను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వీరమణిమాధవరెడ్డి, ఉప సర్పంచ్ శశిరేఖగోపాల్, గ్రామ పెద్దలు, యువకులు పలువురు పాల్గొన్నారు.



నవాంద్గీలో గ్రామ దేవత ఆలయం వద్ద భక్తుల సందడి

8న కొబ్బరికాయల విక్రయానికి బహిరంగ వేలం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 4: ఈనెల 8వ తేదీన తెలంగాణ రాష్ట్రంలో మినీ మేడారంగా ప్రసిద్ధి గాంచిన పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల వేలానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో కొబ్బరికాయలు విక్రయించేందుకు ఈనెల 29నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు రూ.80వేలు, ఒక సంవత్సరం కొబ్బరికాయలు విక్రయించేందుకు (వచ్చే నెల 16నుంచి వచ్చే సంవత్సరం బ్రహ్మోత్సవాలకు ముందు వారం వరకు) రూ.90వేలు చెల్లించాలన్నారు. లడ్డు, ప్రసాదం, పులిహోర విక్రయానికి బ్రహ్మోత్సవాల నుంచి వచ్చే సంవత్సరం బ్రహ్మోత్సవాలకు ముందు వారం వరకు రూ.30వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు మరిన్ని వివరాలకు 9010729852 సెల్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.


పోలెపల్లి ఎల్లమ్మ దేవత ఆలయం

మారుతీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడలోని మారుతీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీలో జరిగిన సమవేశంలో అధ్యక్షుడిగా దయాకర్, ఉపాధ్యక్షుడిగా బిక్షపతి, రామకృష్ణ, ప్రదానకార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శులుగా రాజ్‌కుమార్, సంజీవ, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, ప్రచారకార్యదర్శులుగా రమేష్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్‌రావు, శ్రీను, వెంకట్రాంరెడ్డి, రాజు, శ్రీరాములు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఘట్‌కేసర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్ అభినందించారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని పలుగ్రామాల్లో నేడు సోమవారం పలు అభివృద్ధి పనులను జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు ఎండీవో ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మర్రిపల్లిగూడ, మాదారం, ఎదులాబాద్ గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధుల నుంచి వేసిన సీసీరోడ్లను ఆయన ప్రారంభించనున్నట్లు తెలిపారు. అయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సకాలంలో పాల్గొనాలని తెలిపారు.

యాసంగి ఎవుసం సాగేదెలా?

● అదును దాటినా పూర్తవని నాట్లు

● ఆలస్యం వల్ల దిగబడులపై ప్రభావం

● వాతావరణ పరిస్థితులే కారణమంటున్న రైతులు

పరిగి, ఫిబ్రవరి 4 : 'అదును ఎరిగి సేద్యం.. పదును ఎరిగి పైరు' అన్నారు పెద్దలు. కానీ యాసంగి పంటల సాగులో మాత్రం అలా జరుగక.. నాట్లు వేయడంలో జిల్లా రైతులు వెనుకబడి ఉన్నారు. వరి నాటుకు అదును (సమయం) దాటిపోయింది. అయినా పలు చోట్ల ఆలస్యంగా నాట్లు పడుతున్నాయి. ఈ ఆలస్యం సీజన్ చివరలో పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సంక్రాంతి నాటికే వరినాట్లు పూర్తి కావాల్సి ఉండగా సమయం దాటి దాదాపు ఇరవై రోజులు కావస్తున్నా జిల్లాలో వరినాట్లు కొనసాగుతున్నాయి. పరిగి, దోమ, కులకచర్ల ,బొంరాసిపేట్, యాలల్, తాండూరు మండలాల్లోని పలు గ్రామాల్లో వరినాట్లు ఇంకా కొనసాగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ సారి చాలా ఆలస్యమయిందని అధికార వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో అన్ని రకాల పంటలు కలిపి 79,957 ఎకరాల్లో సాధారణ సాగు ఉంటుందని అంచనా. 32,179 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 16 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నట్లు తెలిసింది.

నీరు, పెట్టుబడి అందకనే..

యాసంగికి ముందు వర్షాలు సరిగా కురువకపోవడం, నీటి లభ్యత తక్కువగా ఉండడంతో సకాలంలో నాట్లు పడలేదు. వాతావరణ పరిస్థితులు, కొత్త రుణాలు, రైతుబంధు అందకపోవడం కూడా పెట్టుబడుల ప్రభావం చూపిందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. డబ్బులు అందకపోవడంతో విత్తనాలు, ఎరువులు సకాలంలో కొనుగోలు చేయలేదు. రుణమాఫీ కాకపోగా ఆలస్యంగా సీజన్ ముగుస్తున్నా నేటికీ కొత్త రుణాల పంపిణీ అంతంతగానే ఉంది. బ్యాంకర్లు రుణాలు ఇవ్వక, ప్రైవేట్ అప్పులు దొరకకపోవడం వల్ల అన్నదాతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిగ్గా నారు పోసే సమయంలోనే తీవ్రమైన చలిగాలుల వల్ల నారుమళ్ళు సరిగ్గా ఎదగలేదు. కొన్ని చోట్ల వాతావరణ పరిస్థితులు దెబ్బతీయగా, ఇంకొన్ని చోట్ల చలితీవ్రత కారణంగా నారు ఎదగలేదు. సకాలంలో ఎరువులు, పోషకాలు అందక చాలా చోట్ల నారు ఎండిపోవడం వల్ల మరోసారి నారు పోయడమూ పంట ఆలస్యానికి కారణమైందని రైతన్నలు వపోతున్నారు.

ఆలస్యం వల్ల నష్టమే..

వరిసాగు కాలం 120 రోజులు. నారు పోశాక నెల రోజులలోపు.. డిసెంబర్ ప్రారంభంలో నారు పోసుకుని, జనవరి మొదటివారంలో నాట్లు పడాలి. ఆ తర్వాత 90 రోజుల్లోపు.. మార్చి చివరినాటికి పంట కోతకు వస్తుంది. కానీ ఈ సారి ఆ పరిస్థితి లేదు. ఏకంగా నెలరోజులు ఆలస్యం కావడంతో ఏప్రిల్ చివరివారమో, మే మొదటివారమో పంట చేతికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్, మేలో వడగళ్ళ వానలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా ఆ సమయానికంటే ముందే కోతలను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. సరైన సమయంలో సాగు చేయకపోవడం వల్ల ఏప్రిల్‌లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం, నీరందకపోవడం వల్ల గింజలు కుదురుకోకపోవడంతో తాలు గింజల శాతం పెరుగుతుందని చెబుతున్నారు. కారణంగా 10 నుంచి 20 శాతం పంట దిగుబడులు తగ్గే అవకాశాలు ఉంటాయని తెలుపుతున్నారు. ఆలస్యం చేయకుండా త్వరగా నాట్లను పూర్తి చేయాలని సూచిస్తున్నారు.



మిట్టకోడూరులో వరినాట్లు వేస్తున్న మహిళలు

నాట్లు ఆలస్యమయ్యాయి



ఈ సారి రబీలో వరినాట్లు వేలయం చాలా ఆసల్యమయింది. ఈ పాటికి కలుపుతీత పనులు చేయాలి. కానీ ఇంకా నాట్లు వేస్తూనే ఉన్నారు. సంక్రాంతి నాటికి వరినాట్లు పూర్తి చేయాలి. ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల నీళ్ల సరిపోకపోవడం, అకాల వర్షాలు, వడగళ్ల వల్ల నష్టం జరిగే అవకాశం ఉంది.

-లక్ష్మీకుమారి, పరిగి వ్యవసాయ సహాయ సంచాకులు,పరిగి

నారు సరిగ్గా రాలేదు..



ఈ సారి నాట్లు వేయడం ఆలస్యమైంది వాస్తవమే. చలిగాలుల తీవ్రత వల్లనే నారు సరిగ్గా రాలేదు. ఆలస్యమైనా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. నీళ్ళు, వడగళ్ళ ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది.

-అంజనేయులు, రైతు,సుల్తాన్‌పూర్, పరిగి

పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

● తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

● ప్రభుత్వం అండగా ఉంటుంది పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చీమ శ్రీనివాస్

చేవెళ్ల, ఫిబ్రవరి 4 : తెలంగాణ ఉద్యమకారులకు ద్రోహం చేసిన కేసీఆర్‌కు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటు ద్వారా సరైన బుద్ధి చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ ఫోరం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన ఉద్యమకారుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తెలంగాణ సంపదను దోచుకున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యమ కేసులకు సంబంధం లేకుండా తమకు ప్రభుత్వ ఫలాలు అందించాలని కోరారు. ప్రొ. కోదండరాంను చట్టసభల్లో అడుగుపెట్టకుండా బీఆర్ఎస్ పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధోగతి పాలు చేశారని విమర్శించారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఉద్యమకారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి స్వయంగా తీసుకెళ్తానని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, మహిళ అధ్యక్షురాలు శ్యామల, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ఉద్యమకారులు కరికె మల్లేశ్, రాములు, కటికె రమేశ్, మద్దూరి మల్లేశ్, కుమ్మరి చెన్నయ్య, పండిత్‌రావు, నాగార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, మెగులయ్య, ఆశోక్, శివకుమార్, బాబా లక్ష్మీ, గోవర్ధన్‌రెడ్డి ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆడ్వాణీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయం

● మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్



ఆడ్వాణీతో దేవేందర్‌గౌడ్ (ఫైల్)

మహేశ్వరం, ఫిబ్రవరి 4 : బీజేపీ అగ్రనేత, రాజకీయ కురువృద్ధుడు ఎల్‌కే ఆడ్వాణీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని ఉమ్మడి ఏపీ మాజీ హోంమంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు తూళ్ల దేవేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆడ్వాణీకి భారతరత్న ప్రకటించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అడ్వాణీ కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్నప్పుడు తాను ఏపీ హోంమంత్రిగా ఉన్నానని, పలు సందర్భాల్లో ఆయనతో సన్నిహితంగా ఉంటూ పాలనాపరమైన సలహాలు తీసుకున్నానని చెప్పారు. ఆడ్వాణీ ఎంతో ఉన్నత వ్యక్తిత్వం కలిగిన గొప్ప నాయకుడని కొనియాడారు. నమ్మిన విలువల కోసం ఎంతో హుందాగా వ్యవహరించేవారన్నారు.

ఏడాదిగా సలహా సంఘం సమావేశాల్లేవ్

● నెలల తరబడి జరగని మీటింగ్‌లు

● కొత్త ప్రభుత్వంలోనైనా జరిగేనా ?



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి భవనం

తాండూరు, ఫిబ్రవరి 4 : అది 200 పడకలు కలిగిన.. జిల్లాలోనే పెద్దాసుపత్రి. దానికి ఓ సలహాసంఘముంది. కానీ ఆ సంఘం ఏడాదిగా సమావేశం కావడమేలేదు. ఆసుపత్రి సమస్యలపై చర్చించడమూ లేదు. అదే తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి. ఈ ఆసుపత్రి సలహాసంఘం అధ్యక్షురాలిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కొనసాగుతున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఈ సంఘానికి కన్వీనర్‌గా, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సభ్యులుగా ఉన్నారు. ఈ సలహా సంఘం ప్రతి మూడు నెలకోసారి సమావేశం కావాలి. ఆసుపత్రిలో డాక్టర్లు, రోగులు, సిబ్బంది సమస్యలను ఈ సమావేశంలో చర్చించడంతో పాటు ఖాళీ పోస్టుల భర్తీ, అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి నివేదించాల్సిన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి వుంటుంది. కానీ ఏడాదిగా సమావేశాలే జరుగలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఇప్పుడైన సలహాసంఘం సమావేశమవుతుందా? ఆసుపత్రి సమస్యలపై చర్చిస్తుందా? అనేది వేచి చూడాలి. మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రి, ఇటీవల కొత్తగా మంజూరైన నర్సింగ్ కళాశాల ఈ ఆసుపత్రి పరిధిలోకి వస్తాయి. ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా సలహా సంఘ సభ్యుల్లో ఒకరుగా కొనసాగుతారు. ప్రస్తుతంసంఘం అధ్యక్షురాలిగా ఉన్న జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి పదవికాలం జూన్‌లో ముగుస్తుంది.

అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

● రాష్ట్ర అథ్లెటిక్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్

శామీర్‌పేట, ఫిబ్రవరి 4 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగి రికార్డులను సాధించాలని రాష్ట్ర అథ్లెటిక్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంట పరిధిలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల అడుగుజాడల్లో నడవాలని, క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థులకు కావలసిన శారీరక, మానసిక ఉత్సాహం క్రీడల ద్వారానే సాధ్యమవుతుందని ఉపాధ్యక్షుడు ప్రభుదాస్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ ప్రతినిధులు వీరశేఖర్, రవి, మణికంఠ, హర్షవర్ధన్, సురేందర్, శ్యాంసుందర్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

హోరాహోరీ తలపడిన క్రీడాకారులు..

జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 200 మంది క్రీడాకారులు అండర్-8, 10, 12, 14 ఏజ్ గ్రూపుల్లో రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ పోటీల్లో పాల్గొని హోరాహోరి తలపడి ఒక్కో ఈవెంట్‌లో 25 మంది చొప్పున మూడు ఈవెంట్లలో 75 మంది క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వారికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, జాయింట్ సెక్రటరీలు అశోక్, దాయాలు, వీరశేఖర్ బహుమతులను ప్రదానం చేశారు.



జిల్లాస్థాయి అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

10న కొత్తగూడెంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో గెలుపొందిన వారిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన 25 మంది క్రీడాకారులను ఈ నెల 10న కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్‌కు పంపుతామని రాజశేఖర్ వివరించారు. వారిని మేడ్చల్ జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు.

యాచారం బస్టాండ్‌లో వసతులు కరువు

● అధికారుల నిర్లక్ష్యం, ప్రయాణికుల అవస్థలు

● కరెంట్‌లేకపోవడంతో రాత్రయితే జంకు

యాచారం, ఫిబ్రవరి 4 : యాచారం బస్టాండ్‌లో సరైన వసతులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇన్నాళ్లు అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం విగ్రహాల ముందు బస్సులు ఆపడం వల్ల ట్రాఫిక్ స్తంభించి వాహనాదారులు ఇబ్బందులు పడడంతో పాటు తరచూ ప్రమాదాలు జరుగేవి. బస్టాండ్‌లో బస్సులు ఆపే విధంగా దేవరకొండ, ఇబ్రహీంపట్నం డిపోల మేనేజర్లు చర్యలు తీసుకోలేకపోయారు. ఇది గమనించిన యాచారం పోలీసులు, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్సై వెంకటయ్య డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి బస్టాండ్‌లోనే ఆపేలా చర్యలు తీసుకోవడంతో ఎట్టకేలకు బస్సులు ఆగుతున్నాయి. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, సీసీరోడ్డు, మంచినీరు, కరెంట్ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

యాచారంలో ప్రయాణికుల ఇబ్బందులను గమనించి మండల కేంద్రానికి చెందిన రెడ్డి జగన్ రెడ్డి 20 ఏళ్ల క్రితం ఎకరం భూమిని ఆర్టీసీకి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడంతో ప్రభుత్వం రూ.35లక్షల వ్యయంతో బస్టాండ్, మరుగుదొడ్లను నిర్మించింది. కానీ ప్రస్తుతం మరుగుదొడ్ల వద్ద చెట్లు పెరగడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ విషయంలో ఇబ్రహీంపట్నం డిపో అధికారులు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని ప్రయాణీకులు కోరుతున్నారు. బస్టాండ్‌లో విద్యుత్ వసతి లేకపోవడంతో రాత్రి వేళ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. చీకటి పడితే ఏం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డుతో పాటు విద్యుత్ వసతి కల్పించి, లైట్లు వేయించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ బస్టాండ్ భూమి విలువ రూ.మూడు కోట్లపైనే ఉంటుంది. బస్టాండ్‌ను వినియోగంలోకి తేవడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని పలువురు తప్పు పడుతున్నారు. బస్టాండ్ ముందు ఆర్టీసీ వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తే సంస్థకు ఆదాయం రావడంతో పాటు ప్రయాణికులకు మేలు జరుగుతుంది.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



యాచారం బస్టాండ్

సమస్యలను పరిష్కరిస్తాం



యాచారం గ్రామపంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. విద్యుత్ వసతి కోసం ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేశాం. సీసీ రోడ్డు నిర్మాణం విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. గ్రామపంచాయతీ నిధుల నుంచి వేయించేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో బస్టాండ్‌లో అన్ని రకాల వసతులు కల్పిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగాకుండాచర్యలు తీసుకుంటాం.

- బి.వెంకటనర్సప్ప, ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

● తాండూరు రూరల్ సీఐ అశోక్



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న రూరల్ సీఐ అశోక్

తాండూరురూరల్, ఫిబ్రవరి 4: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతామని తాండూరు రూరల్ సీఐ అశోక్ అన్నారు. జినుగుర్తి గ్రామంలో ఆదివారం సాయంత్రం యువకులు ఏర్పాటుచేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు క్రీడల్లో ముందుండాలని సూచించారు. క్రీడా పోటీల వల్ల యువత ఆరోగ్యంతోపాటు స్నేహభావం పెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలింగేశ్వర దేవస్థానం ఛైర్మన్ ప్రవీణ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శామప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహులు, అజ్మత్ పాల్గొన్నారు.

సర్పంచుల సేవలు మరువలేనివి

● పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానం



కొడంగల్: పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

కొడంగల్, ఫిబ్రవరి 4: గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ టి.అనితాపకీరప్ప, పాలకవర్గ సభ్యుల సేవలు మరవలేనివని గ్రామస్తులు కొనియాడారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సర్పంచ్ టి.అనితాపకీరప్ప, ఉపసర్పంచ్ ప్రహ్లాద్‌రెడ్డి, వార్డుసభ్యులను గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఐదేళ్ల పదవీకాలంలో కొడంగల్ మండలంలోనే అత్యధిక నిధుల మంజూరు చేసినట్లు గా గడిచిన ఐదేళ్లలో గ్రామపంచాయతీని సొంత ఇంటిగా భావించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు నడిచారని గ్రామస్తులు గుర్తుచేశారు. అదేవిధంగా గ్రామాల్లో చేసిన సేవ తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడూరు: పూడూరు సర్పంచ్ నవ్య నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ రాజేందర్, వార్డుసభ్యులను గ్రామస్తులు శాలువా, పూలమాలలతో ఆదివారం గ్రామపంచాయతీ ఆవరణలో సన్మానించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన సందర్భంలు చెప్పలేనివని, గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లడంలో ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు మల్లేష్, రమేష్, సుభాన్, పాండు, సత్యనారాయణ, రాజు, శేఖర్, సుభాన్, కొండపల్లి రమేష్, మహేష్ పాల్గొన్నారు.



పూడూరు: పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

క్రైం కార్నర్

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేపోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై ఓవ్యక్తి తల మొండెం వేరై పడి ఉండడంతో స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా అతడు ఏపీలోని రేపల్లె గుంటూరు జిల్లాకు చెందిన మోహిత్(30 నుంచి 35)గా గుర్తించారు. నగరంలోని కూకట్‌పల్లి, హౌజింగ్‌బోర్డు కాలనీలో అద్దెకుంటూ పైథాన్ సాఫ్ట్‌వేర్ నేర్చుకుంటున్నట్లు విచారణలో వెల్లడైంది. శనివారం రాత్రి 9గంటలకు బయటకు వెళ్లివస్తానని రూమ్‌మేట్‌కు చెప్పి వెళ్లాడు. ఆదివారం ఉదయం మోహిత్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

కులకచర్ల, ఫిబ్రవరి 4: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. మండలంలోని అంతారం గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా అటుగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

మాట నిలబెట్టుకున్న అసెంబ్లీ స్పీకర్ తనయ

ధారూరు, ఫిబ్రవరి 4: మా నాన్నను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటానని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్ తనయ అనన్య చేతన్ ప్రజలకు వాగ్దానం చేసింది. గెలిచిన తర్వాత తానే వచ్చి సమస్యలు పరిష్కారిస్తానని ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం మండలంలోని కుమ్మర్‌పల్లి, డీకే తండా, ధారూరు, నాగసముందర్ గ్రామాల్లో హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. నాగసముందర్, ధారూరు, డీ.కే.తండాల్లో తాగునీటి సమస్య తీర్చటానికి బోర్లు వేసేందుకు రూ.10లక్షల చొప్పున కేటాయించారు. ఈ గ్రామాల్లో బోర్ పాయింట్లను గుర్తించి ఆమె భూమి పూజ చేశారు. డీకే తండాలో బోర్ డ్రిల్లింగ్‌ను ప్రారంభించారు. కుమ్మర్‌పల్లిలో గ్రామస్తులకు ఇబ్బందికరంగా ఉన్న కరెంట్ సమస్య పరిష్కరించి చింతచెట్టును తొలగిస్తామన్నారు. నిబంధనలు పాటిస్తూ అధికారుల అనుమతులు పొంది చెట్టును తొలగించాలని, కరెంట్ సమస్యను పరిష్కరించాలని ఆమె పార్టీ నాయకులకు సూచించారు. కాగా ధారూరు, స్టేషన్ ధారూరు, నాగసమందర్‌లలో సీసీ రోడ్డుల నిర్మాణానికి రూ.10లక్షల చొప్పున, కుమ్మర్‌పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైనట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు బుజ్జయ్యగౌడ్, మల్లారెడ్డి, కిషోర్, బాబాఖాన్, ఎల్.రాజేశ్వర్, అశోక్, మల్లేశం, మల్లారెడ్డి, గఫార్, యాదయ్య, లాల్‌మహ్మద్, ముజాఫర్, ఇబ్రహహీం, విజయ్ పాల్గొన్నారు.



ధారూరులో బోర్ పాయింట్ వద్ద పూజలు చేసిన అనన్య చేతన్

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన మేడ్చల్ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 4: కరీంనగర్ అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండో నేపాల్ -2024 కరాటే ఛాంపియన్ షిప్‌లో మేడ్చల్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపరిచారు. పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 కరాటే అకాడమికి చెందిన 36మంది విద్యార్థులు పాల్గొన వీరిలో 24 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. మరో 12మంది సిల్వర్ పతకాలను సాధించారు. ప్రస్తుతం నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను మార్షల్ ఆర్ట్స్‌లో మెరుగైన శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనే విధంగా తీర్చిదిద్దుతామని యూనివర్సల్ 369కరాటే అకాడమి కోచ్‌లు ఈ సందర్భంగా తెలిపారు.



ఇండో నేపాల్ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన మేడ్చల్ విద్యార్థులు

ఎమ్మెల్యేకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఎమ్మెల్యే యాదయ్యను పరామర్శిస్తున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్ ఫిబ్రవరి 4: అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో ఎమ్మెల్యేను కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు శ్రీశైల్‌రెడ్డి ఉన్నారు.

తగ్గిపోతున్న పశుసంపద



బాగాయిపల్లి శివారులోని పొలాల్లో మేత మేస్తున్న పశువులు

యాలాల, ఫిబ్రవరి 4: ఒకప్పుడు పశువులతో కళకళలాడే గ్రామాలు నేడు కళాహీనంగా మారుతున్నాయి. ఆధునిక యంత్రాలు వ్యవసాయ రంగంలోకి రావడంతో వ్యవసాయానికి ఉపయోగించే ఎద్దుల జాడ కనిపించడం లేదు. యాలాల మండలంలో అధిక శాతం ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. 30 సంవత్సరాల కిందట ప్రతి గ్రామంలో వ్యవసాయానికి ఉపయోగించే ఎద్దులతో పాటు పాలిచ్చే ఆవులు, గేదెలు వేలసంఖ్యలో ఉండేవి. గ్రామంలోని పశువులన్నింటినీ మేపేందుకు నలుగురైదుగురు వ్యక్తులను ఏర్పాటు చేసి పశువుల యజమానులు వారికి నెల జీతం ఇచ్చేవారు. కాలం గడుస్తున్నా కొద్దీ అంతా మారింది. వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లతో పాటు ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు ఎడ్లకు బదులు యంత్రాలను వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు ఎద్దులు, పశువులతో పనిలేకుండాపోయింది. దాదాపు 90శాతం పశువులు గ్రామాల్లో కనుమరుగయ్యాయి. అక్కడక్కడ కొంతమంది పాల కోసం మాత్రమే ఆవులను పెంచుకుంటున్నారు. ఇంకా కొన్ని సంవత్సరాలు గడిస్తే గ్రామాల్లో పశుసంపద పూర్తిగా కనుమరుగు అయ్యే పరిస్థితి ఏర్పడవచ్చునని పలువురు అంటున్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

● మల్లారెడ్డి హెల్త్‌సిటీ డైరెక్టర్ భద్రారెడ్డి



గెలుపొందిన కింగ్స్ లెవెన్ జట్టుతో భద్రారెడ్డి, కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని మల్లారెడ్డి హెల్త్‌సిటీ డైరెక్టర్ చామకూర భద్రారెడ్డి అన్నారు. మండలంలోని అవుషాపూర్ ద్రోణాచార్య క్రికెట్ మైదానంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీఎల్ క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ కార్యక్రమానికి భద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఏపీఎల్‌లో గెలుపొందిన కింగ్స్ లెవెన్ జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. యువత క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలని తెలిపారు. ఓడిన వారు కుంగిపోకుండా గెలిచిన వారు పొంగిపోకుండా సమానంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి అంజనేయులు గౌడ్, మాజీ సర్పంచ్ భిక్షపతిగౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఎల్సాని అయిలయ్యయాదవ్, నాయకులు కొట్టే గోపాల్‌రెడ్డి, బొడిగే శ్రీనివాస్ గౌడ్, కవాడి వామన్‌రెడ్డి, కుశలవరెడ్డి, వీరేష్, దయాకర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లెకు పోదాం'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 4: బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లెకు పోదాం కార్యక్రమం నేడు(సోమవారం) నుంచి ఈనెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి కార్యాలయంలో ఆదివారం పల్లెకు పోదాం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు కార్యకర్తలు గ్రామాలకు వెళ్లి బీజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరాజ్, పాండుగౌడ్, కేపీ రాజు, నరోత్తంరెడ్డి, వివేకానందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో అసమానతలు దూరం



ఎదులాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అ సంఘం నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4: చదువుతోనే సమాజంలో అసమానతలు తొలగుతాయని ఎదుబాలాబాద్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గుమ్మడి దుర్గయ్య తెలిపారు. ఎదులాబాద్ సౌత్‌ఇండియా బ్యాంక్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి 45వ జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పిస్తూ ఆయనను స్మరిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతీఒక్కరు నడవాలని కోరారు. చదువుతోనే సమాజంలో అసమానతలు తొలుగుతాయని నమ్మిన మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేటితరం యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్: నేటితరం యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ రజక సంఘం అధ్యక్షుడు పి.నారాయణ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఉన్నత చదువులు చదివి దేశానికి రాజ్యాంగాన్ని రచించాడని గుర్తుచేశారు. నేడు అందరికీ రాజ్యంగమే ఆధారమైందన్నారు. నేటి యువత మంచి చదువులు చదివి సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఘట్‌కేసర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ ఆశయ సాధనకు ముందుకు సాగుదామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్ కుమార్, దాసు, నర్సింగరావు, అశోక్, శరత్, అంజయ్య యాదగిరి, సుందర్, సచిన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్

పరిగి, ఫిబ్రవరి 4: పరిగి పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి రచించిన 'సమస్త సాధనలో సౌజన్యమూర్తులు' కొత్త పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. నగరంలో బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. చరిత్ర, సంస్కృతిని గుర్తుచేసే అనేక పుస్తకాలు రచించిన భాస్కరయోగిని లక్ష్మణ్ అభినందించారు.

పిల్లలకు చదువులతో పాటు ఆటలు అవసరం



పార్క్‌లో ఆటవస్తువులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ అనంత్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 4: పిల్లలకు చదువులతో పాటు ఆటలు ఎంతో అవసరమని కౌన్సిలర్ అనంత్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు కార్తికేయనగర్ పార్క్‌లో ఆదివారం ఆట వస్తువులను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్లే పిల్లలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారని అన్నారు. వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ హోంగార్డులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 4: మాజీ హోంగార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఇంద్రవెల్లి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర డీజీపీకి ఆదేశాలు జారీ చేయడం సంతోషదాయకమని మాజీ హోంగార్డులు ఆర్.నాగప్ప, జే.నగేశ్, ఖాసీం, నర్సింహులు, ఎండీ.అక్లక్ హుసేన్, నర్సింహులు, మల్లికార్జున్, తదితరులు అన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం వారు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో పలుమార్లు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమని అన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సుదర్శన హోమం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4: ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలనే సుదర్శనహోమం నిర్వహిస్తున్నట్లు ఎదులాబాద్ గోదా సమేత శ్రీమన్నార్ రంగనాయకస్వామి ఆలయం ధర్మకర్తలు తెలిపారు. మండలంలోని ఎదులాబాద్ గోదా సమేత శ్రీమన్నార్ రంగనాయక స్వామి ఆలయంలో ప్రతీనెల మొదటి ఆదివారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఉదయం స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొని సుదర్శన హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ప్రతీనెల మొదటి ఆదివారం ఆలయంలో సుదర్శనహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీఒక్కరు దైవభక్తిని కలిగి ఉండాలన్నారు. దైవచింతనతో ఏకాగ్రతతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని తెలిపారు. సుదర్శన హోమానికి భక్తులిచ్చే కట్నకానుకలతో ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, గోవిందాచార్యులు, శేషాచార్యులు, అచ్యుతాచార్యులు, పవనకుమారాచార్యులు, అదిత్యాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కాలనీల పరిశుభ్రతకు సహకరించాలి



కాలనీల్లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ ఛైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమన్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4: కాలనీల పరిశుభ్రతకు ప్రతీఒక్కరు సహకరించాలని పోచారం మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, హనుమాన్‌నగర్, సాయినగర్, ఇంద్రానగర్ కాలనీల్లో కమిషనర్ వేమన్‌రెడ్డితో కలిసి ఆదివారం ఉదయం మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

శామీర్‌పేట, ఫిబ్రవరి 4: మండలంలోని తూంకుంట మున్సిపల్ దేవరయాంజాల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1994-1995 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం దేవరయాంజాల్ జడ్పీఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని పెద్దఎత్తున జరుపుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులతో కలసి మధుర స్మృతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల్లో అప్పట్లో బోధించిన గురువులకు ఆ పూర్వవిద్యార్థులు ఎంతో ఆత్మీయ అభిమానంతో సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు. అప్పటి ఉపాధ్యాయులతో విద్యార్థులు గత మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి హెచ్‌ఎం వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయులు బాపురెడ్డి, హన్మంత్‌రావు, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, ఉమాదేవి, స్థానిక జడ్పీ పాఠశాల హెచ్‌ఎం బాలేష్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

వంకాయ చెట్టు ఎంతెత్తో..!



వంకాయ చెట్టు 3 నుంచి 4 అడుగుల వరకు ఎత్తు పెరగడం సాధారణంగా మనం చూస్తుంటాం. ఇక్కడ కనిపిస్తున్న వంకాయ చెట్టు ఏడు ఫీట్ల ఎత్తులో పెరిగింది. ఈ వంకాయ చెట్టు బషీరాబాద్ మండలం జీవన్గిలోని రైతు కోటపు అనంత్‌రెడ్డి ఇంటి వాకిట్లో ఉంది. ఈ చెట్టు కాత కాసినప్పుడల్లా రెండు కిలోల నుంచి మూడు కిలోల వంకాయలు వస్తాయని రైతు చెబుతున్నారు. - బషీరాబాద్